క్లుప్తంగా

యువ వైజ్ఞానిక పోటీలో విద్యార్థి ప్రతిభ



ప్రథమ బహుమతి పొందిన విద్యార్థి శ్రీకర్

చివ్వెంల : హైదరాబాద్‌లోని నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్‌లో భారతీయ అంతరిక్ష పరిశోధనా కేంద్రం (ఇస్రో) ఆధ్వర్యంలో యువ వైజ్ఞానిక కార్యక్రమం (యువిక-2025)లో భాగంగా యువ సైంటిస్ట్‌లకు ఈ నెల 19నుంచి 30వరకు శిక్షణ నిర్వహించారు. ఈ శిక్షణలో మండల పరిధిలోని దురాజ్‌పల్లి గ్రామశివారులోని ఎంఎస్‌ఆర్ సెంట్రల్ స్కూల్ విద్యార్థి బీబీరెడ్డి శ్రీకర్‌రెడ్డి ప్రతిభ కనబర్చాడు. ఈ సందర్భంగా నిర్వాహకులు నిర్వహించిన యూజ్ ఆఫ్ జియో ఏఐ ఇన్ శాటిలైట్ డేటా ఎనాలిసెస్ పోటీల్లో విద్యార్థి ప్రతిభ కనబర్చి ప్రథమ బహుమతి పొందాడు. ఈ సందర్భంగా సెంటర్ డైరెక్టర్ డాక్టర్ ప్రకాశ్‌చౌహాన్ చేతుల మీదుగా బహుమతి అందుకున్నారు. విద్యార్థిని కరస్పాండెంట్ కొల్లు శ్రీనివాస్, ఉపాధ్యాయులు అభినందించారు.

దరఖాస్తుల ఆహ్వానం

భానుపురి (సూర్యాపేట) : చివ్వెంలలోని మినీ గురుకులంలో 2025-26 విద్యా సంవత్సరానికి 1వతరగతిలో ప్రవేశాల కోసం అర్హులైన మండలానికి చెందిన గిరిజన బాలిక అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల విద్యాలయాల సొసైటీ ప్రాంతీయ సమన్వయాధికారి బలరాం శుక్రవారం తెలిపారు. చివ్వెంల మినీ గురుకులంలో 1వ తరగతిలో 30, 2వ తరగతిలో 02, 3వ తరగతిలో 02, 4వ తరగతిలో 01, 5వ తరగతిలో 9 సీట్లు ఉన్నట్లు వెల్లడించారు. సంబంధిత పత్రాలతో జూన్ 6వతేదీ సాయంత్రం లోగా చివ్వెంల మినీ గురుకులంలో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. అదే నెల 9న అడ్మిషన్ కమిటీ సమక్షంలో ఎంపికలు ఉంటాయన్నారు.

ప్రెస్‌క్లబ్ భవనం నిర్మించాలని మంత్రికి వినతి

సూర్యాపేట : పట్టణంలోని పాత మిర్చియార్డులో ప్రెస్‌క్లబ్ భవనాన్ని నిర్మించాలని కోరుతూ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి తెలంగాణ స్టేట్ జర్నలిస్ట్ అసోసియేషన్ (టీఎస్‌జేఏ) వ్యవస్థాపక అధ్యక్షుడు కందుకూరి యాదగిరి శుక్రవారం కలెక్టరేట్‌లో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. జర్నలిస్టులకు పక్కా భవనం లేక చెట్ల కింద ప్రైవేటు భవనాల కింద టీస్టాల్ వద్ద హోటల్లో గడపాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు. అందరికీ అందుబాటులో ఉండేలా అన్ని సౌకర్యాలతో కూడిన పక్క భవనాన్ని 500గజాల స్థలాన్ని కేటాయించి నిర్మించాలని డిమాండ్ చేశారు.

అంగన్‌వాడీ టీచర్ ఉద్యోగ విరమణ



ఉద్యోగ విరమణలో పాల్గొన్న అంగన్‌వాడీ సిబ్బంది

సూర్యాపేట అర్బన్ : దురాజ్‌పల్లి సెక్టార్‌లోని కుడకుడ అంగన్‌వాడీ సెంటర్- 1లో టీచర్ పనిచేస్తున్న సరోజిని శుక్రవారం ఉద్యోగ విరమణ పొందారు. ఈ సందర్భంగా ఆమెను మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన అంగన్‌వాడీ టీచర్లు ఘనంగా పూలమాల, శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో సీడీపీఓ శ్రీవాణి, ఏసీడీపీఓ సాయిగీత, సూపర్‌వైజర్లు సునీత, శ్రీదేవి, దురాజ్‌పల్లి సెక్టార్ అంగన్‌వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

ధ్వజస్తంభ ప్రతిష్ఠాపనకు విరాళం అందజేత



కమిటీకి నగదు అందజేస్తున్న నాయకులు

తుంగతుర్తి : మండల పరిధిలోని గొట్టిపర్తి గ్రామంలో జూన్ 2నుంచి 5వరకు శివాలయంలో జరిగే ధ్వజస్తంభ ప్రతిష్ఠాపనకు మాజీ ఎమ్మెల్యే కిశోర్‌కుమార్ పంపిన రూ.25వేల విరాళాన్ని శుక్రవారం బీఆర్‌ఎస్ నాయకులు ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు తాటికొండ సీతయ్య, రాములుగౌడ్, రాష్ట్ర బీసీ కమిషన్ మాజీ సభ్యుడు కిషోర్‌గౌడ్, బీఆర్‌ఎస్ నాయకులు తెడ్డు హరిబాబు, బర్ల సోమన్న, దూదిగాని లింగయ్య, బాలగాని ప్రవీణ్, దొంగరి వెంకన్న, తాళ్లపల్లి యాకన్న, వెంకటాచారి, సురేష్, పరశురాము, నగేష్ పాల్గొన్నారు.

వివేక్ వెంకటస్వామికి మంత్రి పదవి ఇవ్వాలి

సూర్యాపేట : కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి ఎనలేని సేవలు చేసిన జి.వెంకటస్వామి కుటుంబానికి చెందిన డాక్టర్ జి.వివేక్ వెంకటస్వామికి మంత్రివర్గంలో చోటు కల్పించాలని మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు తల్లమల్ల హసేన్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గిడ్డ పరంజ్యోతిరావులు శుక్రవారం ప్రభుత్వాన్ని ఒక ప్రకటనలో కోరారు.

ముమ్మరంగా మొక్కల పెంపకం

- 31పంచాయతీల్లో నర్సరీలు ఏర్పాటు
- మండలంలో 3.10లక్షల మొక్కలు నాటడమే లక్ష్యం
- నిత్యం పర్యవేక్షిస్తున్న అధికారులు
- జూన్‌లో నాటేందుకు కార్యాచరణ



చివ్వెంల నర్సరీలో పెరుగుతున్న మొక్కలను పరిశీలిస్తున్న అధికారులు

చివ్వెంల : పర్యావరణ పరిరక్షణలో భాగంగా విరివిగా మొక్కలు నాటి తెలంగాణలో అడవుల శాతం పెంచేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా వనమహోత్సవ కార్యక్రమాన్ని ప్రవేశపెట్టింది. ఈ మేరకు జూన్‌లో చేపట్టనున్న వనమహోత్సవానికి మండలంలో 31 నర్సరీల్లో మొక్కల పెంపకం ముమ్మరంగా సాగుతుంది. ఉపాధిహామీ పథకంలో పంచాయతీలో నర్సరీలు, గ్రామీణ అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నర్సరీ పెంపకం చేపట్టారు. రెండు నెలలుగా మొక్కల పెంపకం కొనసాగుతుంది.

3.10లక్షలు నాటడమే లక్ష్యం..

మండలంలోని 31గ్రామపంచాయతీలకు గాను 31నర్సరీల్లో 3.10లక్షల మొక్కలను పెంచుతున్నారు. ప్రతి గ్రామ పంచాయతీలో దాదాపుగా 10వేల మొక్కలు పెంచుతున్నారు. దీంతో మండలంలో 3.10లక్షల మొక్కలు నాటడమే లక్ష్యంగా పెట్టుకున్నారు. ప్రతి రోజు నర్సరీలను ఎంపీడీఓ సంతోష్‌కుమార్, ఏపీఓ నాగయ్య పర్యవేక్షిస్తున్నారు. నర్సరీల్లోని నిర్వాహకులకు పలు సూచనలు, సలహాలు చేస్తున్నారు.

వేసవిలో కూలీలకు ఉపాధి..

రెండు నెలల నుంచి నర్సరీలో 10మందికి ఉపాధి కల్పించారు. పాలిథిన్ కవర్‌లో మట్టిని నింపడం, మొక్కలు, విత్తనాలు నాటడం, రోజూ ఉదయం, సాయంత్రం నీటి సరఫరా చేయడం, కలుపు తీయడం తదితర పనులు చేస్తున్నారు. వేసవిలో చేతినిండా పనులు దొరకడంతో కూలీలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

ప్రతి నర్సరీలో వివిధ రకాల మొక్కలు..

ఉపాధిహామీ పథకంలో కొనసాగుతున్న నర్సరీలో పలు రకాల మొక్కలను పెంచుతున్నారు. టేకుతో పాటు జామ, దానిమ్మ, నిమ్మ, చింత, వెదురు, మునగ, వేప, సుబాబుల్ తదితర మొక్కలు పెంచుతున్నారు.

జూన్ నాటికి అందుబాటులోకి మొక్కలు

మండలంలో 31నర్సరీల్లో పెంచుతున్న మొక్కలు జూన్ నాటికి అందుబాటులోకి వస్తాయి. మండలంలో ప్రతి గ్రామపంచాయతీలోని నర్సరీలో 10వేల మొక్కలు పెంచుతున్నాం. నర్సరీలపై ప్రత్యేక దృష్టి సారించాం.

– సీహెచ్.సంతోష్‌కుమార్, ఎంపీడీఓ, చివ్వెంల

చలువ పందిళ్లు ఏర్పాటు చేశాం

మండల వ్యాప్తంగా నర్సరీల్లో మొక్కల పెంపకం ముమ్మరంగా సాగుతుంది. ముఖ్యంగా అనుకున్న సమయానికి మొక్కలు సిద్ధంగా ఉంచేందుకు కృషి చేస్తున్నాం. వేసవిని దృష్టిలో పెట్టుకుని మొక్కలు చనిపోకుండా చలువ పందిళ్లు కూడా ఏర్పాటు చేశాం.

– ఇరుగు నాగయ్య, ఏపీఓ, చివ్వెంల

ఆధునిక వ్యవసాయ పద్ధతులు పాటించాలి



రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ పద్మావతి

తాళ్లగడ్డ (సూర్యాపేట) : రైతులు ఆధునిక వ్యవసాయ పద్ధతులు పాటించాలని భారతీయ వ్యవసాయ వరి పరిశోధన సంస్థ ప్రిన్సిపల్, శాస్త్రవేత్త డాక్టర్ సీహెచ్.పద్మావతి అన్నారు. వికసిత్ కృషి సంకల్ప అభియాన్‌లో భాగంగా శుక్రవారం సూర్యాపేట మండలంలోని ఇమాంపేటలో కేవీకే గడ్డపల్లి ఆధ్వర్యంలో రైతులకు వానాకాలం పంటల సాగు, యాజమాన్య పద్ధతులపై ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. భూసార పరీక్షకు మట్టిని సేకరించే విధానం, వివిధ రకాల జీవన ఎరువులు వాడడం వలన ఉపయోగం, వాడకంలో రైతులకు కలిగే లాభాల గురించి వివరించారు. ఎరువులు ఒకే దఫా కాకుండా మూడు నాలుగు దఫాలుగా ఉపయోగించాలని, ఎరువుల సమతుల్య వాడకం, చెరువు మట్టి తోలడంతో ఉపయోగాలు, పచ్చిరొట్టల పంట ఆవశ్యకత తదితర అంశాలపై రైతులకు తెలిపారు. అధిక దిగుబడినిచ్చే విత్తన రకాలు, నూతన సాంకేతిక పరిజ్ఞానం, యాంత్రీకరణ, డ్రోన్ వినియోగం, వివిధ పంటలలో చీడపీడల యజమాన్య పద్ధతులు తదితర అంశాలపై క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించారు. తక్కువ ఖర్చుతో అధిక ఫలితాలు సాధించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో సేంద్రియ వ్యవసాయం, సమర్థ నీటి వనరుల ఉపయోగం, డ్రిప్ ఇరిగేషన్, చిరుధాన్యాల ప్రాముఖ్యత, పెరటి తోటల పెంపకం, పుట్టగొడుగుల పెంపకం వంటి అంశాలపై వివరించారు. అనంతరం రైతులకు వ్యవసాయ విధానాలపై కరపత్రాలు అందించారు. కార్యక్రమంలో కేవీకే గడ్డిపల్లి సీనియర్ సైంటిస్ట్ హెడ్ ఇన్‌చార్జ్ డి.నరేష్, మండల వ్యవసాయ అధికారి కృష్ణ సందీప్, కేవీకే గృహవిజ్ఞాన శాస్త్రవేత్త ఎన్.సుగంధి, వ్యవసాయ విస్తరణ అధికారి సుష్మ, గ్రామపంచాయతీ కార్యదర్శి కె.జ్యోత్స్న, పతంజలి కంపెనీ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ సాగుతో అధిక లాభాలు



నాగారం : ఆయిల్‌పామ్ మొక్కలు నాటుతున్న ఫీల్డ్ ఆఫీసర్ అశోక్, సిబ్బంది

నాగారం : నీటివసతి ఉన్న రైతులు ఆయిల్‌పామ్ తోటలను సాగు చేసి అధిక లాభాలను పొందవచ్చని పతంజలి ఆయిల్‌పామ్ కంపెనీ ఫీల్డ్ ఆఫీసర్ పి.అశోక్, క్షేత్ర సహాయకులు రంగు ముత్యంరాజు అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని ఫణిగిరి గ్రామంలో ఆయిల్‌పామ్ పంట సాగు చేస్తున్న రైతు కిసిరెడ్డి నర్సింహారెడ్డి వ్యవసాయ క్షేత్రంలో మొక్కలను నాటే కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉన్న దీర్ఘకాలం పంట అయినా ఆయిల్‌పామ్ తోటలను సాగుచేస్తే రైతులు ఎకరానికి రూ.2లక్షల వరకు నికర ఆదాయం పొందవచ్చన్నారు. ఆయిల్ పామ్ సాగు చేసే రైతులకు ప్రభుత్వం బిందు సేద్యం, ఎరువులకు, అంతర పంటలకు రాయితీలు ఇస్తుందని తెలిపారు. ఆయిల్‌పామ్ పంటను ప్రభుత్వం నిర్ణయించిన ధరకు ప్రభుత్వం నియమించిన కంపెనీ వారే కొనుగోలు చేస్తారని, దళారుల ప్రమేయం ఉండదన్నారు. ఆయిల్‌పామ్ తోటలు సాగు చేయాలనుకున్న రైతులు ఉద్యానశాఖ అధికారులకు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో రైతులు నరసింహారెడ్డి, రాజు తదితరులు పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ సాగుకు ప్రభుత్వ ప్రోత్సాహం

అర్వపల్లి : ఆయిల్‌పామ్ సాగుకు రైతులకు ప్రభుత్వం ప్రోత్సాహకాలు అందిస్తుందని పతంజలి ఆయిల్‌పామ్ కంపెనీ ప్రతినిధులు అశోక్, ముత్యంరాజు తెలిపారు. శుక్రవారం అర్వపల్లిలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఆయిల్‌పామ్ సాగు చేసే రైతులు 8179538511, 8639087839కు సంప్రదించాలని కోరారు.

రైతులకు అందుబాటులో జీలుగ విత్తనాలు



ఆత్మకూర్(ఎస్) : రైతులకు జీలుగ విత్తనాలు పంపిణీ చేస్తున్న అధికారులు

నాగారం : మండల కేంద్రంలోని వ్యవసాయ కార్యాలయంలో రైతులకు కావాల్సిన పచ్చిరొట్ట జీలుగ విత్తనాలు అందుబాటులో ఉన్నాయని మండల వ్యవసాయ శాఖ అధికారి కృష్ణకాంత్ తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. మండలానికి 18క్వింటాళ్ల జీలుగ విత్తనాలు వచ్చాయని, వాటిని 50 శాతం సబ్సిడీపై రైతులకు అందించనున్నట్లు తెలిపారు. 30కిలోల జీలుగ విత్తనాల బస్తా పూర్తి ధర రూ.4275 కాగా రాయితీపై రూ.2138 లకు అందిస్తున్నట్లు తెలిపారు. విత్తనాలు కావాల్సిన రైతులు తమ పట్టాదార్ పాస్‌పుస్తకం, ఆధార్ కార్డుల జిరాక్స్‌లను తీసుకొని వ్యవసాయశాఖ కార్యాలయంలో సమర్పించాలని కోరారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

జీలుగ విత్తనాల పంపిణీ

ఆత్మకూర్(ఎస్) : మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం, వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం రైతులకు సబ్సిడీపై జీలుగ విత్తనాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారిని దివ్య మాట్లాడారు. పచ్చిరొట్టగా జీలుగును పొలంలో వేసి కలియదున్నితే భూసారం పెరుగుతుందని, దీంతో దిగుబడులు పెరగడంతో పాటు ఎరువుల ఖర్చు తగ్గుతుందని, ఇది పంటలకు అవసరమైన పోషకాలను అందిస్తుందన్నారు. ప్రభుత్వం 50శాతం రాయితీపై విత్తనాలు అందిస్తుందన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ సీఈఓ లక్ష్మారెడ్డి, ఏఈఓలు పవన్, శివమూర్తి, బాలాజీ, లక్ష్మీప్రసన్న, శివకుమార్, పీఏసీఎస్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

విద్యుదాఘాతంతో గేదెలు మృతి



కుంచమర్తిలో మృతిచెందిన గేదెలు

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం మండల వ్యాప్తంగా శుక్రవారం విద్యుదాఘాతంతో ఒకే రోజు 7గేదెలు మృతి చెందాయి. అర్వపల్లికి చెందిన సోముల అర్వపల్లి పాడి గేదె విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వైర్లను తగిలి అక్కడికక్కడే మృతి చెందింది. అలాగే కుంచమర్తిలో షేక్ అజీజుద్దీన్‌కు చెందిన మూడు గేదెలు, ఇదే గ్రామానికి చెందిన తోట జానయ్య గేదె, కోడూరులో లాలుకు చెందిన గేదె, గోపాల్‌రెడ్డినగర్‌లో దేవులపల్లి వీరారెడ్డికి చెందిన రెండు గేదెలు విద్యుదాఘాతంతో మృతి చెందాయి. ఈ గేదెల విలువ సుమారు రూ. 5లక్షలకు పైగానే ఉంటుందని, ఆదుకోవాలని బాధిత రైతులు వాపోయారు.

కుట్టుమిషన్లు అందజేత

తిరుమలగిరి : మండలంలోని తాటిపాముల గ్రామంలో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సహకారంతో 700 మంది మహిళలకు కుట్టుమిషన్లు అందజేసినట్లు కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షుడు నాయిని కృష్ణయాదవ్ శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మంత్రి సహకారంతో గ్రామంలో బిక్కేరు వాగుపై బ్రిడ్జి నిర్మాణం, చెక్ డ్యాం పనులు సాగుతున్నాయన్నారు. జెడ్పీ ఉన్నత పాఠశాల అభివృద్ధికి అదనపు గదుల కోసం రూ.కోటి నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎర్ర యాదగిరి, నాయకులు పాల్గొన్నారు.



మహిళలకు కుట్టుమిషన్లు అందజేస్తున్న సుదర్శన్‌రెడ్డి

పెద్దిరెడ్డి గణేష్‌కు ఎన్టీఆర్ స్మారక అవార్డు

సూర్యాపేట : విజయవాడకు చెందిన ప్రముఖ ఎక్స్‌రే సాంస్కృతిక సంస్థ ప్రతి ఏటా ఎన్టీఆర్ జయంతిని పురస్కరించుకుని స్మారక అవార్డులు అందజేస్తుంది. ఈ సంవత్సరం రెండు తెలుగు రాష్ట్రాలలోని వివిధ రంగాలలో ప్రముఖులైన వారిని ఈ అవార్డుకు ఎంపిక చేసింది. ఈ సందర్భంగా మనం వికాస వేదిక స్థాపించి గత మూడు దశాబ్దాలుగా రాష్ట్ర వ్యాప్తంగా ఎన్నో సాహితీ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించిన పెద్దిరెడ్డి గణేష్‌ను ఈ అవార్డ్ వరించినట్లు ఆయన పేర్కొన్నారు. శనివారం సాయంత్రం విజయవాడ సిద్ధార్థ కళాశాల ఆడిటోరియంలో అవార్డ్ అందుకోనున్నట్లు ఆయన వెల్లడించారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

అర్వపల్లి : అర్వపల్లిలోని 33/11కేవీ విద్యుత్ ఉపకేంద్రంలో మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 8గంటల నుంచి 11గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని మండల విద్యుత్ ఏఈ వాస శ్రీకాంత్ శుక్రవారం తెలిపారు. అర్వపల్లి టౌన్‌తో పాటు జాజిరెడ్డిగూడెం, పర్సాయపల్లి, కొత్తగూడెం, కాసర్లపహాడ్, సీతారాంపురం, బొల్లంపల్లి, తుంగగూడెం, కొత్తగూడెం గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు, అందుకు వినియోగదారులు సహకరించాలని కోరారు.

మందుల సామేల్‌కు మంత్రి వర్గంలో చోటు కల్పించాలి

నాగారం : కాంగ్రెస్ అధిష్టానం ఎమ్మెల్యే మందుల సామేల్‌కు మంత్రి వర్గంలో చోటు కల్పించాలని యూత్ కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షుడు షేక్.హుస్సేన్ కోరారు. శుక్రవారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్న దళిత సామాజిక వర్గానికి చెందిన సామేల్‌కు అవకాశం కల్పించాలని కోరారు. ఆయన వెంట యూత్ కాంగ్రెస్ నాయకులు తదితరులు ఉన్నారు.

నిరుద్యోగులను విస్మరిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం



అశోక్‌ను అదుపులోకి తీసుకున్న పోలీసులు

ఆత్మకూర్(ఎస్) : కాంగ్రెస్ ప్రభుత్వం నిరుద్యోగులను విస్మరిస్తుందని తెలంగాణ స్టూడెంట్స్ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు భారీ అశోక్‌కుమార్ అన్నారు. హలో నిరుద్యోగి–చలో హైదరాబాద్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండల పోలీసులు విద్యార్థి సంఘ నాయకులను ముందస్తుగా అరెస్టు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రతి సంవత్సరం జాబ్ క్యాలెండర్ ద్వారా లక్ష ఉద్యోగాలు ఇస్తామని చెప్పి అమలు చేయకుండా నిరుద్యోగులను ప్రభుత్వం మోసగిస్తుందని, కాంగ్రెస్ ఇచ్చిన హామీలు కాగితాలకే పరిమితం అవుతున్నాయని అన్నారు. తక్షణమే జాబ్ క్యాలెండర్ విడుదల చేసి లక్ష ఉద్యోగాలను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు.

ఉపాధ్యాయులకు రక్షణ కవచం పీఆర్‌టీయూ

- ఎమ్మెల్సీ పింగళి శ్రీపాల్‌రెడ్డి



చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్సీ శ్రీపాల్‌రెడ్డి

సూర్యాపేటటౌన్ : ప్రతి ఉపాధ్యాయుడికి పీఆర్‌టీయూ రక్షణ కవచంగా ఉంటుందని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పింగళి శ్రీపాల్‌రెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణంలో ఇటీవల మృతిచెందిన ఉపాధ్యాయుల కుటుంబాలకు రూ.లక్ష చొప్పున సంఘం సంక్షేమ నిధి నుంచి చెక్కులను అందజేసి మాట్లాడారు. చివ్వెంల మండలంలోని దురాజ్‌పల్లి ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న లిక్కి రామారావు, పట్టణంలోని ఎంఏఎం హైస్కూల్లో స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న గోపనబోయిన అశోక్‌కుమార్ ఇటీవల మరణించగా వారి కుటుంబ సభ్యులకు జిల్లా సంఘం కార్యాలయంలో ఒక్కొక్కరికి రూ.లక్ష చొప్పున చెక్కులు అందజేసినట్లు తెలిపారు. అలాగే వారి కుటుంబానికి రావాల్సిన ఆర్థిక ప్రయోజనాలు, ఉద్యోగ కల్పన ఇప్పించే బాధ్యత తనదేనని, రాబోయే కాలంలో ఉద్యోగ ఉపాధ్యాయులకు నగదు రహిత చికిత్స అందించే హెల్త్ పాలసీని రాష్ట్రంలో పనిచేస్తున్న ఉద్యోగ, ఉపాధ్యాయులకు కాంట్రాక్టు సిబ్బందికి అందరికీ వర్తింపజేసేలా చూస్తానని అన్నారు. రాబోయే కాలంలో ప్రస్తుత ప్రభుత్వం తన మేనిఫెస్టోలో పెట్టిన విధంగా సీపీఎస్ విధానాన్ని రద్దు చేయించి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించేలా ప్రభుత్వాన్ని ఒప్పిస్తానని అన్నారు. గతంలో ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వుల ప్రకారం కారుణ్య నియామకం ఉద్యోగి మరణించిన నెలలోపు వారి కుటుంబ సభ్యులకు వచ్చేలా కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు తంగెళ్ల జితేందర్‌రెడ్డి, జిల్లా మాజీ అధ్యక్షుడు బొల్లికొండ కోటయ్య, నల్లగొండ జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల జాన్‌రెడ్డి, కందుకూరి శివశంకర్, వల్లెం శంకర్‌ప్రసాద్, పటేల్ శ్రీమాన్‌రెడ్డి, మారగాని వెంకటేశ్వర్లు, వల్లెం శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సీతారామచంద్రస్వామి మాసకల్యాణం



ప్రత్యేక అలంకరణలో దేవతామూర్తులు

తాళ్లగడ్డ (సూర్యాపేట) : పట్టణంలోని బొడ్రాయి బజార్‌లో గల శ్రీ వేదాంత భజన మందిరంలో శుక్రవారం శ్రీసీతారామచంద్రస్వామి జన్మనక్షత్రం (పునర్వసు) సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పంచామృత అభిషేకం, మాస కల్యాణం ఘనంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో మందిర ప్రధాన అర్చకుడు దరూరీ సింగరాచార్యులు, వేదాంత భజన మందిరం అధ్యక్షుడు రాచర్ల వెంకటేశ్వరరావు, కోశాధికారి సోమ అశోక్, అర్చకులు ధరూరి రాఘవాచార్యులు, గోమటం ఫణికుమారాచార్యులు, కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య



తాటిపాములలో బడి బాటలో కార్యక్రమంలో పాల్గొన్న ఉపాధ్యాయులు, గ్రామస్తులు

తిరుమలగిరి : ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని ఇన్‌చార్జ్ హెచ్‌ఎం డాక్టర్ మేడబోయిన లింగయ్య అన్నారు. శుక్రవారం మండలంలోని తాటిపాములలో జెడ్పీ ఉన్నత పాఠశాల ఆధ్వర్యంలో బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బడి ఈడు పిల్లలందరినీ ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని ప్రచారం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలలో చదివితే నాణ్యమైన విద్యతో పాటు ఉత్తమ ఫలితాలు వస్తున్నాయన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు ప్రైవేట్ పాఠశాలలను ఆశ్రయించి ఆర్థికంగా ఇబ్బందులకు గురికావొద్దన్నారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులను చేర్పించేందుకు గ్రామ పెద్దలు, యువత సహకారం అందించాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కె.సంతోష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బీఎస్‌ఎన్‌ఎల్ వినియోగదారులకు అవగాహన



సదస్సులో మాట్లాడుతున్న అసిస్టెంట్ జనరల్ మేనేజర్ గుర్వయ్య

భానుపురి (సూర్యాపేట) : సూర్యాపేట పట్టణంలోని బీఎస్ఎన్ఎల్ ఎక్ఛేంజ్ కార్యాలయంలో వినియోగదారులు, సిబ్బందికి శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా బీఎస్ఎన్ఎల్ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ ఎం.గుర్వయ్య మొబైల్ రేడియేషన్, సైబర్ నేరాలు, డిజిటల్ మోసాలు, నకిలీ కాల్స్, సందేశాలు, భారత్ నెట్ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సంస్థ ఎస్‌డీఈలు ఎం.సైదులు, వి.ప్రేమ్‌లత, ఆర్ఏఓ జి.నాగేశ్వర్, లచ్చు తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య ఉపకేంద్రం నిర్మాణానికి స్థలం విరాళం



స్థలం పత్రాన్ని అందజేస్తున్న దాత లింగమల్లు

నాగారం : మండల పరిధిలోని డి.కొత్తపల్లి గ్రామంలో ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్ర భవన నిర్మాణానికి గ్రామానికి చెందిన పాక లింగమల్లు తన తల్లిదండ్రులైన పాక గట్టయ్య-సోమక్కల జ్ఞాపకార్థం 240గజాల (2గుంటలు) స్థలాన్ని విరాళంగా ఇచ్చారు. శుక్రవారం గ్రామపెద్దల సమక్షంలో పంచాయతీ కార్యదర్శి కొమ్ము అరుణ్‌కు భూమి విరాళ పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా లింగమల్లును గ్రామస్తులు అభినందించారు. కార్యక్రమంలో గ్రామస్తులు గైగుల్ల లింగయ్య, కొండ మల్లేష్, బెల్లి సైదులు, యారాల నర్సిరెడ్డి, దేవరకొండ మల్లయ్య, దేవరకొండ వెంకన్న, లింగాల అంజయ్య, గండ్ర కలింగారెడ్డి, సంపేట కృష్ణమూర్తి, నాతి ఉప్పలయ్య, శ్రీనివాస్, సంపేట యాకయ్య, తుక్కాని లింగారెడ్డి, మోదాల నర్సయ్య, అవిలయ్య, వీరయ్య, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా నారసింహుడి నిత్యకల్యాణం

మఠంపల్లి : మట్టపల్లి శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో శుక్రవారం శ్రీరాజ్యలక్ష్మి, చెంచులక్ష్మి సమేత శ్రీలక్ష్మీనరసింహస్వామి నిత్యకల్యాణాన్ని అర్చకులు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రాతఃకాలార్చన, సుప్రభాతసేవ నిర్వహించారు. కల్యాణ వేడుకలో భాగంగా మాంగల్యధారణ, తలంబ్రాలతో నిత్యకల్యాణాన్ని కమనీయంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు విజయ్‌కుమార్, మట్టపల్లిరావు, ఈవో నవీన్‌కుమార్, అర్చకులు ఇన్‌స్పెక్టర్ శేషగిరిరావు, భక్తులు పాల్గొన్నారు.

వేలం ద్వారా రూ.10.50 లక్షల ఆదాయం

మట్టపల్లి దేవాలయంలో తలనీలాలు సేకరణ హక్కుకు శుక్రవారం నిర్వహించిన బహిరంగ వేలంలో దేవాలయానికి రూ.10 లక్షల 50 వేలు ఆదాయం సమకూరినట్లు ఆలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు విజయ్‌కుమార్, మట్టపల్లిరావు, ఈవో నవీన్‌కుమార్ తెలిపారు. దేవాదాయ ధర్మాదాయ శాఖ పర్యవేక్షణాధికారి టి.వెంకటాచలపతి సమక్షంలో నిర్వహించిన ఈ వేలంలో ఆరుగురు డిపాజిట్ చెల్లించి వేలంలో పాల్గొన్నట్లు తెలిపారు. నల్లగొండ జిల్లా త్రిపురారంనకు చెందిన అవిరెల్లి నాగయ్య రూ.10 లక్షల 50 వేలకు ఒక ఏడాది కాలానికి గాను తలనీలాలు పొగు చేసుకునే హక్కును వేలం పాటలో దక్కించుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

అందని కిట్లు.. కూలీల పాట్లు!

- ఉపాధి పనుల్లో వసతులు కరువు
- పనిప్రదేశంలో కూలీలకు అందని ప్రథమ చికిత్స
- ఏళ్ల తరబడి మెడికల్ కిట్లు రాని వైనం



మాచారంలో ఉపాధిహామీ పనులు చేస్తున్న కూలీలు (ఫైల్)

పెన్‌పహాడ్ : ఉపాధిహామీ పథకంలో పనులు చేస్తున్న కూలీలకు ప్రథమ చికిత్స కిట్లు అందక అనేక ఇబ్బందులు పడుతున్నారు. పనులు చేసే ప్రదేశంలో అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నట్లు ప్రకటిస్తున్నా ప్రభుత్వం నీడ కోసం గ్రీన్‌నెట్, ఓఆర్‌ఎస్ ప్యాకెట్లతోనే సరిపెడుతోంది. ఉపాధిహామీ పనులు జరుగుతున్న చోట కూలీలకు ప్రథమ చికిత్స కిట్లు అందుబాటులో లేకపోవడంతో అవస్థలు ఎదుర్కొంటున్నారు. షామియానాలు ఏర్పాటు చేయడంతో పాటు ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు మాత్రమే సమకూర్చారు. మండలంలో 12108 జాబ్‌కార్డులు ఉండగా యాక్టివ్ 6938 జాబ్‌కార్డులు ఉన్నాయి.

ప్రథమ చికిత్స కిట్లు లేక ఆరోగ్యకేంద్రాలకు పరుగులు..

కూలీలకు కల్పించాల్సిన సౌకర్యాలలో ప్రథమ చికిత్స కిట్లు ప్రధానమైనవి. పని ప్రదేశంలో గునపాలు, పారలు, తట్టలతో మట్టి పనులు చేస్తున్నప్పుడు కూలీలు గాయపడితే చికిత్స అందుబాటులో ఉండడం లేదు. పని ప్రదేశంలో కూలీలు గాయపడితే ప్రథమ చికిత్స అందించే వసతి లేక ఆరోగ్య కేంద్రాలకు పరుగులు తీస్తున్నారు. ప్రాణాపాయ పరిస్థితి ఏర్పడినప్పుడు ఇబ్బందులు పడుతున్నామని కూలీలు చెబుతున్నారు. బాధితుడిని ఆసుపత్రికి తరలించేలోపు ఏదైనా ప్రమాదం జరిగితే ఎవరు బాధ్యత తీసుకుంటారని ప్రశ్నిస్తున్నారు. ఇందుకు అవసరమైన కిట్లపై అధికారులు శ్రద్ధ చూపకపోవడం రైతుల పాలిట శాపంగా మారింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి కిట్లు అందేలా చర్యలు తీసుకోవాలని కూలీలు కోరుతున్నారు.

2015–16నుంచి అందని కిట్లు..

2015–16 నుంచి ఆరోగ్య కిట్లు అందుబాటులోకి లేవు. పనిప్రదేశాల్లో వాటిని ఏర్పాటు చేయలేదు. పంచాయతీలు వాటిని ఏర్పాటు చేయాలనే నిబంధన ఉంది. కానీ పాలకవర్గాలు లేకపోవడం, నిధుల కొరత కారణంగా గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పించడమే కష్టమవుతుందని, ఇక ప్రథమ చికిత్స కిట్లు ఎలా సమకూర్చగలమని గ్రామపంచాయతీ కార్యదర్శులు అంటున్నారు.

ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు అందించాం



కూలీలు పనిచేసే ప్రదేశాల్లో ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు అందించాం. ప్రభుత్వం నుంచి ప్రథమ చికిత్స కిట్లు మంజూరు కావడం లేదు. కూలీలకు ప్రథమ చికిత్సకు సంబంధించిన సదుపాయాలు స్థానిక ఆసుపత్రి నుంచి తీసుకెళ్లి అందుబాటులో ఉంచుతున్నాం.

– రవి, ఏపీఓ